పెద్ద కథ

# బొడ్రాయి

## ..భూపాల్...



**బా**జారు వీపుమీద ఆరు దెబ్బలు వేశాడు వెంకటయ్య. పద్మ తల్లడిల్లింది. ఏడ్చింది. అందరూ లేచారు. పద్మ తల్లితో వెళ్ళిపోయింది. సుజాతా కదలక తప్పలేదు.

మరునాడు రాత్రి ఎనిమిది గంటలు కావొస్తోంది. పొయ్యి దగ్గర కూర్చున్న సుజాత కట్టెలు, పిడకలు మండక యాతన పడుతూ వంట చేసుకుంటూంది. "కిరోసిన్ డీలర్కి రాక వారం దాటింది. దాని గూర్చి ప్రయత్నం చేసి సక్రమంగా తెప్పించవచ్చు. తెచ్చే కోటాలో అవకతవకలు జరుగుతున్నాయి. కానీ, అది మరో పోరాటం. దానికి సమయం చిక్కాలిగా!" ఇలా అనుకుంటుండగానే తను వుండే గది తలుపు గొళ్ళెం ఎవరో కొడుతున్న శబ్దం వినిపించింది. వెళ్ళి చూస్తే ఆ వచ్చిన వ్యక్తి బాజారు.

బాజారును తను తరచూ చూస్తుంది. అతని తల నిండా ఉంగరాల జుట్టు వున్నా చాకిరేవులో సోడు నీళ్ళు పడి కాబోలు రాగి తీగెల్లా వుంటుంది. బట్టలుతికే బండ శరీరం బలిష్టంగా వుంది.

"టీచర్ నేను దిక్కూమొక్కూ లేనోన్ని. ఒకటి రెండు ముచ్చట్లు అడిగి తెలుసుకుందామని, నా బాధ చెప్పకుందామని ఒచ్చిన. ఇట్లు దర్వాసు పక్కకు కూసుందునా, కోపం జేయొద్దు" అన్నాడు తలుపు తీయగానే.

"కూర్చో బాజారూ! దానికేముందీ" గదిలోపలున్న స్టూలు చూపిస్తూ అంది.

సుజాత ఈ ఊరికొచ్చిన కొత్తలో ఊరి చాకలోని పేరు 'బాజారు' అని ఎవరో చెపితే 'అదేం పేర'ని అడిగింది. 'బాజారు' అంటే 'బజార్' 'వీధి' 'రోడ్డుసైడు' అంటూ **వాని తల్లివాన్ని చాకిరీ** వులోనో, ఇంట్లోనో కనలేదు. వాడు కడుపులో వుండగా మైల బట్టల మూట మోసుకొని బజార్ గుండా వెళుతుంటే విపరీతమైన పురిటి నెప్పులు పడి వీధిలోనే ప్రసవించిందంట. ఆ విధంగా బజార్లో పుట్టినవాన్ని అందరూ 'బజారుగాడు' అంటూ పిలవగా పిలవగా 'బజారు' అనే పేరు స్థిరపడిపోయిందని చెప్పగా విన్నది.

పోయి మీద నుండి అన్నం గిన్నె దించింది సుజాత. బయట సన్నగా చినుకులు పడుతున్న చప్పుడు- చల్లగాలి వీస్తోంది. కరెంటు బల్బ్ వెలుగుతోంది. అది ఏ నిమిషంలో ఆరిపోతుందో ఎవరికీ తెలియదు- కనుక అగ్గిపెట్టీ, దీపం బుడ్డీ దగ్గర పెట్టుకుని గదిలో మూలనున్న ఇనుప మడత కుర్చీ వాల్చుకుని కూర్చుంది సుజాత. అలా కూర్చొని అతని దిక్కు చూసి "ఇగ చెప్పు ఏం ముచ్చట?" అంది.

"టీచరమ్మా! మేము సాటుమాటు పనులు జేసి లోకం కన్ను కప్పాలనుకుంటె పద్మ ఇప్పటివరకు కడుపుతోటి వుండేది కాదు. కడుపు రాకుంటనే సూసుకుంటుండె. సత్యప్రమానంగా చెపుతున్న ఆమె నా నరనరాన కలిసి పానం లెక్క కదుల్తది. ఆమె మూడేండ్ల సంది పడుతున్న కష్టాలు సూడజాలక నా సొంతం జేసుకుందామనుకున్న. చేసుకున్న. నేనంటే తనకూ పంచపానాలే. ఐతే నన్నూ, ఆమెనూ ఆ కులపోళ్ళు, నా కులపోళ్ళూ తిట్టిండ్రు. రాత్రి పంచాది కాడికొచ్చిన నా దెగ్గరోళ్ళూ, నన్ను తిట్టక ఇడిసిపెట్టలేదు. మా ఇద్దరికీ ఈ కష్టాలొస్తయని తెలుసు. అసలు సంగతి తెలిస్తే ఆమెను కులంల కెల్ల ఎలగొట్టి నా తోటి పంపిస్తరనుకున్నాం. కని అట్లజరగలేదు.

టీచర్ నా భూమి నా తాతల కాలం నాటిది. నా అమ్మ నాకు ఇచ్చింది. ఇయ్యాల ఆ భూమి పోతుంది. పోనీ, పద్మ కోసం ఇడిసిపెడ్త. నన్ను ఊరి నుండి ఎల్లగొట్టి మాదిగిండ్ల అవతల వుండమన్నరు. ఉంట. కనీ, పద్మ బాగుంటదంటరా? పద్మ సుఖపడ్తదని ఈ పెద్ద మనుషులు రాసిస్తరా? నేనేమో ఐపోతే నాకు బాధలేదు. పద్మ సచ్చిపోతదేమోనన్న అనుమానముంది. ఎన్నోసార్లు ఈ ఊరినీ, ఈ మనుషుల్నీ ఇడిసేసి ఏడికన్నా పారిపోదాం, లేచిపోదాం పదూ' అని నన్ను ఎంతో బతిమాలింది. నేను పోలేదు. ఎందుకంటరేమో నాకు ఈ జన్మనిచ్చిన అయ్య నడుములు లేవని రోగిస్తుడు. ఆయనను ఇడిసిపెట్టి మేము ఎల్లిపోతే నేను మనిషినే కాను" అన్నాడు. అతని గొంతులో దుఃఖం పొంగు పొడసూపుతోంది.

బాజారు చెప్పిన మాటలన్నీ శ్రద్ధగా విన్న సుజాతకు ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు దొరికాయి. ఇక ఏమీ అడగాలనిపించలేదు. రెండు నిముషాలు మౌనంగా కూర్చుంది. తర్వాత "సరే! ఇక నీవు వెళ్లు. భూమి అమ్ముతానని అప్పుడే ఎవ్వరి దగ్గరా డబ్బు తీసుకోకు. ఇంకా పద్నాలుగు రోజుల టైవుంది గదా! పది రోజుల తర్వాత నాకు కనిపించు" అంది. అతన్ని పంపిస్తూ....

సన్నని సాలెగూడు తీగెల్లాంటి వాన చినుకుల్లో కలసి మెల్ల మెల్లగా చీకట్లో కరుగుతూ వెళ్ళిపోయాడు బాజారు. ఆ రాత్రి చాలా పొద్దుపోయే వరకు నిద్రరాలేదు సుజాతకు.

ఆ తర్వాత ఐదు రోజులు గడిచాయి. పద్మ తల్లి దగ్గరే వుందా! అత్తవారింటిలోనా? తెలుసుకొని ఆనాటి సాయంత్రం తల్లి దగ్గరే వున్న పద్మను కలిసేందుకు వెళ్ళింది సుజాత.

ఆంధ్రజ్యోతి వారపత్రిక 5-1-96

వద్మా జానకమ్మా సుజాతని చూసి ఎంతో సంతోషపడారు. పద్మ టిఫిన్ చేసి పెట్టింది. 'టీ' కాచి ఇచ్చింది.. జానకమ్మ తన కిరాణా కొట్టులో కూర్చుని వుంది. అనాటి జానకమ్మ మాటలు జ్ఞాపకమొచ్చి నవ్వుకుంది సుజాత. ఆమెదో ప్రత్యేకమైన పాత్ర. ఇట్లాంటి వాళ్ళు తటస్థపడడం చాలా అరుదు. నిజంగా ఈమెను చూస్తే అంత మాటమనిషిలా అగుపించదు. గట్టి పిండమే అనుకుంది.

రెండురోజుల క్రితం వీళ్ల ఇంటికి రామలింగం వచ్చి వెళ్ళిన సంగతి విన్నవే సుజాతకి తెలిసింది. ఇక పద్మ ద్వారా విషయాలు తెలుసుకోవాలని "పద్మా! బాజారు భూమి అమ్మేసి డబ్బు తయ్యారు జేస్తుండు. ఊరి బయట గుడిసె ఏసుకునే ప్రయత్నాలూ జరుగుతున్నాయ్. నీ భర్త లేనినాటి మాట వేరు. ఏం జరిగిందో జరిగిపోయింది. ఇప్పుడు మరి వురుడు ఎక్కడ పోసుకుంటవ్? ఈడనేనా? మీ ఆయిన నిన్ను పట్నం తీస్కపోతనన్నడా?" అని అడిగింది సుజాత.

"మా ఆయనా!! వాడో మొగోడా? పశువు, రాక్షసుడు. అనితోని ఒక్క యాదాది వున్న. అదు మనిషే కాదు. అయ్యకూ, అమ్మకూ, సుట్టాలకూ సేవలు జెయ్యాలని నా మెడకు తాడుగట్టిండు. అదెప్పుడో తెంపేసిన. నేను పెండ్లాన్నని ఈడ యమ్మలోళ్లకు నన్ను అప్పజెప్పి అదు దుబాయ్ దేశం బొయ్యిండు. అడనే సస్తె బాగుండె. మల్లెందు కొచ్చిండో..." కోపంతో అంటున్న పద్మ మాటల మధ్యలోనే అందుకొని...

"నిన్నంత బాధపెట్టాడా పద్మా?" అంది సుజాత.

"ఎన్నని జెప్తాను! అదున్నప్పుడు నా తప్పులేందే తిట్టేది. కొట్టేది. కాల్చేది. మీ అమ్మకున్న ఐదెకరాల భూమి అమ్మి పైసలు దెమ్మని బాధ పెట్టుండె. కిరాణా దుకాణంల లక్ష సంపాదించి అమ్మ దాచుకుందట అవ్వీ తెమ్మని కొడుతుండె. నన్ను ఆ ఆస్తి కోసమే చేసుకున్నడంట. అదు దేశం బోతె పీడ పొయ్యిందనుకున్న. ఐనా నన్ను ఒక్కరోజన్నా మా అమ్మతానికి పంపలేదు నా అత్త రాచ్చసిముండ. రాత్రీ పగలూ ఒక్కదాన్నే అన్ని పనులు జెయ్యాలె. ఆమెనేమో మంచినీళ్ల గలాస ముట్టుకుంటె కరిగిపోతననుకుంటది. తెల్లారితే పండ్లు తోముకునెటందుకు పండ్లపొడి కూడ అందియ్యాలె."

"బాజారు ఎట్లా దెగ్గెరైండు?"

పద్మ నవ్వింది. సంతోషంతో "చిన్నతనం నుండి చూస్తున్న బాజారును. బాజారు లెక్క మనిషి మాటలొక్కరుండరు. నాకు బతుకు ఇచ్చింది బాజారే. లేకుంటే నేనెప్పుడో సచ్చిపోయేదాన్ని. బాజారు ఇంత మంచోడని తెలిస్తే అందర్నీ లాతుగొట్టి ముందే అతన్ని చేసుకునేదాన్ని. ఎన్కశారి తెలిసింది. ఐనా కొంపమునగలే బాజారే నా మొగుడు."

* ఎవరివద్దయితే నీ సహజ స్వభావంతో వ్యవహరించటానికి వెనుకాడవో అతడే నీ నిజమైన స్నేహితుడు

సేకరణ: [illegible]

"మరి ఆరోజు అంత మందిల భర్త కలలొచ్చిండని ఎందుకన్నవ్?"

"మరేమనాలో తోచలేదు. అదంతా ఒట్టిమాట. లోకం ఏమంటదో చూద్దామనే అన్న. అంతేగాదు. అట్లనే దెబ్బలు తిని చస్తుంటిగాని, బాజారు పేరు బైట పెట్టకపోతుంటి. బాజారు అక్కడుంటే నన్ను తానే కాపాడుకుంటడు లేకుంటే చచ్చిపోదమనే అనుకున్న."

మరో పది నిమిషాలు అలా మాట్లాడుతూ కూర్చొని "బాగా చీకటిపడింది ఇక పోతా పద్మా" అంటూ లేచింది సుజాత.

అంతకుముందే జానకమ్మ కొట్టులో నుండి లేచి వీళ్ల మాటలు ఏవీ పట్టించుకోక అలా వంటింట్లోకి వెళ్లి వంట పనుల్లో వుండిపోయింది. సుజాత లేచి నిలబడ్డది గమనించి వాళ్ల దగ్గరకొచ్చి "బువ్వ తినిపోతే బాగుంటది సుజాతమ్మా" అంది.

"అవును కలిసి తిందాం కూసో టీచర్" అంది పద్మ ఉత్సాహంగా.

"ఇవాళ కాదు నేను వండుకుంది వుంది. ఈసారి ఒచ్చినప్పుడు తప్పక తింటా" అంటూ బయలుదేరింది సుజాత.

* * *

కోదండం ఇంటి ముందు పడకకుర్చీలో కూర్చొని తన ట్రాక్టర్‌కి ఏదో రిపేర్ వస్తే చేయిస్తున్నాడు. బాజారును చూసి వేళగాని వేళలో వస్తున్నాడని కాబోలు ..."ఏంరా! బాజారూ నీ పనులెంతవరకొచ్చినయ్? పెద్ద మనుషులు చెప్పిన తీర్మానం సజావుగా సాగాలె. లేదంటే చిక్కులల్ల పడతవ్. భూమి అమ్మినట్టులేదు. రూపాయిలేదన్న అడిగినవా? గుడిసెకు భూమి సూపుమనీ రాకపోతివి? ఏంది కథా? ఏం యోచన జేస్తున్నవ్‌రా?" అన్నాడు మాటలో దీర్ఘాలు తీస్తూ ...

ఆయనకి నమస్కరించిన బాజారు. దగ్గరగా వచ్చి "అయ్యా! రూపాయిలు తయ్యారుజేసిన, నాకు ఇగ ఊర్లెనే ఉండబుద్దైతలేదు. ఇయ్యాల్లనో, రేపో రాత్రికే రూపాయిలు అందరిముందల ముట్టజెప్పి నేనెటన్నా యెల్లిపోత" అన్నాడు.

"అందరితోటి పనేందిరా ఇంకా! ఇద్దరు పెద్దల్ని ఎంటవెట్కపోయ్యి కోటిలింగానికి రూపాయలు కట్టకపోయినావు? ఐనా నువ్వు ఊర్ని ఇడిసిపెట్టుడెందుకురా?"

"ఏందో పటేలా నా మనసు తావుమంటలేదు. అగమాగముంది. మెదళ్లరికినట్టనిపిస్తుంది. ఇగ పదిమందిల రూపాయలు ముట్టజెప్పి చేసిన తప్పుకు చెంపలేసుకొని వెళ్లిపోదామనుకుంటున్న. ఈ మాటే నా అమ్మకూ జెప్పిన. జెర సువెట్లైన రేపు రాత్రికి పెద్దలందర్నీ పిలువనంపు. దండం పెద్ద" అన్నాడు బాజారు.

"సరే పోరా! ఇగ నీ ఇష్టం" అన్నాడు కోదండం.

* * *

మృగశిర వెళ్లిపోయింది. ఆరుద్ర నగం నడిచింది. మూడురోజుల క్రితం పడ్డ వర్షంతో ఊళ్లలో చల్లదనం చోటుచేసుకుంది. వేడి నుండి బయట పడ్డ జనం హాయిగా చల్లగాలి పీల్చుకుంటున్నారు. రైతులు విత్తనాలు వేసుకుంటున్నారు.

రాత్రయింది. బొడ్రాయి దగ్గరకి ఆనాటి జనం ఇంచుమించు అందరూ వచ్చారు. పద్మనూ, పద్మ తల్లి జానకమ్మనూ పిలువలేదు. వాళ్ల అవసరం లేదని పెద్దలు నిర్ణయం తీసుకున్నారు.

ఆరుద్రకార్తెలో అకు అల్లాడదనే సామెతగా అంతా నిశ్శబ్దంగా వుంది. అంతలో ...

"ఆ! చెప్పరా బాజారూ! రూపాయలు తెచ్చినవా?" అన్నాడు కోదండం పటేలు.

బాజారు లేచి నిలబడ్డాడు. ఐదు అడుగులు ముందుకు నడిచాడు. "అయ్యా! ఇగో ఈ సంచిల రూపాయలున్నయి. ఇప్పుడే ఇచ్చేసి ఈ రాత్రికే నేను మల్ల మీకు కనబడకుంట యెల్లిపోత. ఐతే నాకు పంచాయితి చెప్పిన పెద్దలు మీరు ఓ కాయితం రాసియ్యాలె. అదేదంటే నేనేసిన ఇత్తనం, నా బీజం, నా సంతానం పద్మ కడుపుల పెరుగుతుంది. ఆమె రేపో, మాపో కంటది. పుట్టిన బిడ్డ నా సంతానం. ఆ బిడ్డను నాకిచ్చేస్తమని కాయితం రాసిచ్చి ఈ రూపాయలు తీసుకోండ్రి" అన్నాడు గట్టిగా, చేతిలో వున్న సంచి చూపిస్తూ!

కోటిలింగం నాలుక కరుచుకున్నాడు

రామలింగం కండ్లు తేలవేశాడు.

అందరూ విస్తుపోయి విన్నారు.

సుజాత తన స్నేహితులతో మౌనంగా కూర్చొని ఎవ్వరేమంటున్నారో వింటోంది. బాజారు చెప్పింది విని కొందరైతే పక్కున నవ్వారు. కోదండం ఒక్క నిమిషం సుజాత దిక్కు చూశాడు.

అట్లా అరుగు మీద కూర్చున్న పెద్ద బుర్రలు పావుగంట తర్జనభర్జనలకు లోనయ్యాయి. వాళ్ళు పిలిస్తే కోటిలింగం, రామలింగం కూడా వెళ్ళి కలసి చర్చించుకుంటున్నారు. బయట అందరికీ వినిపించని మాటలు, గుసగుసలు, సైగలు, అవుననీ, కాదనీ చేతులు ఆడించడం తప్ప వాళ్ళ చర్చ అక్కడున్న జనాలకు వినిపించకుంది. ఒక దశలో కోటిలింగం, కోదండం పటేలుకి నమస్కరించడం కూడా జనం గమనించారు. తర్వాత తండ్రి కొడుకుల్ని వేరుచేసి పెద్దలే మరో పావుగంట చర్చ

సాగించారు. పెద్దల తీర్పు ఎదురుదెబ్బ తీసిందని అంతా అయోమయంగా అటు దిక్కు చూస్తున్నారు.

"అందరూ వినండ్రి. అసలేమైందో ఇంకా మీకు అర్థం కాకుండొచ్చు. పద్మకూ, బాజారుకూ ఏ సంబంధమూ లేదు. పద్మ కడుపులో వున్న పాపకు తండ్రి రామలింగమేనట. బుద్ధి గడ్డి తిని, మనసు తావున లేక, డబ్బుకు కక్కుర్తిపడి తన భార్య మీద తప్పు పంచాది పెట్టినందుకు ఊరి ముందు చెంపలేసుకుంటున్నాడు. ఎనిమిది నెలల కింద దుబాయ్ షేక్ పని మీద బొంబాయి వరకొచ్చి తిరిగి ఎల్లిన రామలింగం ఆ సమయంల పద్మను అడిగి పిలిపించుకుండంట. పద్మ చిన్నత్త అంటే అత్త యశోదమ్మ చెల్లెలు బొంబాయిల వున్న సంగతి మన లోపట అందరికి తెలును. అగో ఆ నాల్గు రోజులు వీళ్ళు కలసి వున్నందుకు పద్మకు గర్భం వొచ్చింది. ఇప్పుడు తనకు అంతా గుర్తుకొచ్చి తన తప్పును ఒప్పుకున్నాడు. మనిషే మనిషి. మనిషన్నప్పుడు తప్పు ఒప్పులూ జరుగుతనే వుంటయి. కనుక బాజారు మీద ఏ నేరమూ లేదు. ఇక ఎవ్వరి బతుకు వాళ్ళు బతకొచ్చు. ఇట్ల మేమందరం మన ఊరి బొడ్రాయి కాడ మొన్నటి తీర్పును సరిగ జేసి ఈ తీర్పు చెపుతున్నం" అన్నాడు హనుమంతు.

"అయ్యా! మొన్న దెబ్బలన్నీ కొడితిరి. నోటి కొచ్చిన తిట్టు తిడితిరి. ఇయ్యాల పద్మది తప్పే కాదంటున్నరు. ఇదే మీ న్యాయమా? ఈడ వున్నోళ్లందరూ మీరు చెప్పిన తీర్మానం ఒప్పినోళ్లేనా? " కొంగు నడుముకు చుట్టిలేచి నిలబడి అడిగింది చంద్రమ్మ.

"మీ తీర్పును ధర్మంగా: చెప్పండి హనుమంతుగారూ! అసలు సంగతి ఇక్కడున్న అందరికీ అంతో ఇంతో తెలును. ఈడ చంటి పిల్లలేం లేరు. బాజారును వదిలేస్తే రామలింగానికి మీరేం ఫైన్ వేస్తున్నారు" అన్న సుజాత "మీ తీర్మానం ప్రకారం ఏ మాత్రం ఇష్టం లేకున్నా పద్మ అతనితో సంసారం చేయవలసిందేనా? పెద్దలు మీరందరు కలసిఇక్కడ పద్మకు న్యాయం చేశామనే అనుకుంటున్నారా?" అన్నది.

సభ మళ్ళీ నిశ్శబ్దంలో మునిగింది. పెద్దలు మరోసారి చర్చల్లోకి దిగారు.

ఇంతలో ఇంకా సహనం భరించలేక "అయ్యా! పెద్ద పటేలా! నేను పొయ్యి పద్మను తోల్కరానా? బొంబాయి పోయిందెప్పుడో తెలుస్తది! గంతేగాదు, నీవు ఈ రామలింగం తోటి సంసారం చేస్తవా అని అడుగొచ్చు గూడ" అన్నాడు గట్టిగా వెంకటయ్య.

"అరే! ఎంకటీ నువ్వు నోరు మూసుకో! నీకు నేను చెప్పిన్నా తోల్కరమ్మని? గాడ్డి కొడకా! ఆ పిల్ల రామలింగమంటే ఇష్టం లేదని నీ తోటి చెప్పిందా? ఇంత మందిల చెప్పిందా? కట్టిన వున్నోకూ, పెండ్లికీ విలువుందిరా! ఇంకా ఆ పిల్లను అవమానం జేస్తమా? ఇప్పటికే శానయింది. ఎక్కువ మాట్లాడకు నువ్వుండు" అన్నాడు కోదండం.

పది నిమిషాల తర్వాత...

ఈసారి కోదండం లేచి నిలబడ్డాడు. అందరి దిక్కు ఒకసారి చూసి, "ఈ పంచాది అంతా ఒక్క రామలింగం బుద్ధిలేనితనంతోటే ఇంత దూరం వొచ్చింది. కోటిలింగం ఆశకు గట్టిగా గొళ్లెం పడ్డది. చాలా నీచంగా ఆళ్ల కొంచెపు గుణం బైటపెట్టుకున్నారు. మన ఊరిల కుల మతాలకు గండి పడలేదు. ఎవ్వరి విలువలు వాళ్లకున్నాయి. బజారుగాడు తప్పును నెత్తిన మోద్దామనుకున్నడు. అమాయకుడు, మేమూ చిన్న పొరపాటు పడే నిజమే గావొచ్చు అనుకున్నం. బినా చంద్రమ్మా, టీచర్ సుజాతగారూ చెప్పినట్టు రామలింగానికి జుల్మానా వేయాలె. అది మాకు తోచనే లేదు. ఇప్పుడు చెప్పేదేమంటే బాజారు ఇక్కడున్న పంచాదిల కెవ్వరు పిలువకున్నా నేరం నెత్తినేసుకొని దెబ్బలు తిన్నడు. జుల్మాన రామలింగానికి ఇస్తానన్నడు. ఇదంతా తప్పని తెలిసి గూడ రామలింగం పైన పదివేలకాశపడి దాన్ని బాధపెట్టిండు. కనుక ఆ బజారు తనకు ఇస్తాననుకున్న పదివేలు రామలింగమే పంచాది ముందు కక్కాలె. మిగతా ఐదువేల రూపాయలల్ల ఐదువేలు ఇప్పుడే తెచ్చి బాజారుకు ఇయ్యాలె. మిగతా ఐదు వేలు ఈడున్న ఏరాంజనేయుస్వామి గుడికి ఖర్చుపెట్టాలెనని మేం తీర్పు చెపుతున్నం.

ఇగ పద్మ సుజాత టీచరమ్మ తోటి ఏం చెప్పకుందో మాకు సంబంధం లేదు. పెండ్లంటె మారేండ్ల పంట. పద్మ కడుపుల పెరుగుతున్నది రామలింగం సంతానమేనని మేము నమ్ముతున్నం. ఇక ఎవరి మనసులో ఏమున్నా మర్చిపొయ్యి ఊరు




'పెద్ద' ఉద్యోగం

'ఇంటర్వ్యూ' కొచ్చిన అతన్ని ఆ ఆఫీసు ఇన్‌ఛార్జి అడిగారు.

"అయితే, ఈ ఆఫీసులో మీకు ఉద్యోగం చేయాలనుందన్నమాట. ఏం చేస్తారు మీరు?"

"చెయ్యడమా? ఏమీ చెయ్యను. ఉద్యోగం చేస్తానంతే" అన్నాడతగాడు.

"సారీ! మీరింకొంచెం ముందరే రావలసింది. మీరు చేయాలనుకుంటున్న పెద్ద జీతాల ఉద్యోగాలన్నీ భర్తీ అయ్యాయి సార్" అన్నాడు ఇన్‌ఛార్జి వినయంగా.

శాంతంగా ఎప్పటి లెక్క వుండాలని కోరుతున్నాం" అన్నాడు.

జనమంతా కాస్సేపు మౌనంగా వుండి ఇక వెళ్లిపోదామని లేస్తున్నారు. అంతలో "అరే ఎంకటీ. కోటి లింగం సేటు వెంట పోయి, ఆయన ఐదు వెయిలిస్తడు తీస్కరా పో" అని చెప్పాడు కోదండం.

"నేను పోను పటేలా" వెంటనే జవాబు చెప్పాడు వెంకటయ్య.

కావలికాడు వెంకటయ్య నోటి నుండి పటేలుకు బదులు పలికింది ఇదే మొదటిసారి. అందరూ ఆశ్చర్యంతో వెంకటయ్యనూ, కోదండంనూ చూశారు. కోదండం ఆ పని మరొకరికి చెప్పాడు. "వెంకటిగాడు ఈ రోజు ఇంతమందిలో తన తల తీసేశాడు" అనుకున్నాడు మనస్సులో...

ఐదు వేలు వచ్చాయి. బాజారు చేతిలో పడ్డాయి. ఇక పంచాది ముగిసిందని పెద్దలు చెప్పారు. అందరూ ఎవరిల్లకు వాళ్ళు వెళుతున్నారు. చిటపట చినుకులు మొదలయ్యాయి.

వెంకటయ్య కదలలేదు. ఉన్నచోటే వున్నాడు. అంతవరకూ దించుకున్న తల ఎత్తాడు... "అయ్యా! పంచాది పెద్దలారా! జెర్రాగుండ్రి. పంచాది కొచ్చినోళ్ళు జెర్ర నిలవడుండ్రి. ఇగ నేను నా కావలితనం రేపటి సంది చేస్తలేను... అప్పటి వరకూ ఎన్నో ఐన పనులూ, కాని పనులూ చేసిన. గుంజుమంటే గుంజిన, తన్నమంటే తన్నిన, కొట్టమంటే కొట్టిన. ఇగ నా తరం గాదు. ఏదన్నా కూలిపాలి జేసుకొని బతుకుతగని, ఈడ కావలోనిగ బతుక. బొడ్రాయి తీర్మానం ధర్మమనాకు తోస్తలేదు. ఒంకర పోయింది. నూటితనం ఏందంటే నా మాట ఇనుండ్రి. ఆ రామలింగం తోటి పద్మను ఇడిపిచ్చి, బాజారు గానికి ఇచ్చి పెండ్లి జెయ్యుండ్రి... నా మాట ఇనుండ్రి... నా మాట ఇనుండ్రి" అంటూ చెప్పేదేదో అందరికీ వినిపించేలా అరుస్తూ చెప్పాడు.

ఒక్క నిమిషం ఆగిన పెద్దల్లో నుండి "ఇప్పటికే శానరాత్రయ్యింది. అందరు ఇండ్లకు పొండ్రి. వెంకటిగానికి ఇయ్యాల పిచ్చి లేసినట్టుంది" అన్నాడు కోదండం,

అందరూ మెల్ల మెల్లగా వెళ్ళిపోతున్నారు. బాజారు, సుజాత, చంద్రమ్మ ఇంకా కొందరు స్త్రీలు వెంకటయ్యను చూస్తూ నిల్చున్నారు. వర్షం మరికాస్త ఎక్కువైంది. ఇకవాళ్ళు అక్కడి నుండి కదిలారు.

ఆ రాత్రి వర్షం భోరున కురిసింది. ఉరుములు, మెరుపులు. ఊళ్ళో కరెంటు లేదు.

తెల్లవారింది. ఊరి బొడ్రాయి స్థానంలో రాయి లేదు. గుంట తీసుంది. ఆ గుంటలో బురదనీళ్ళు నిలిచున్నాయ్.

(సమాప్తం)